


# మానవసేవ ప్రమాదకరం

తాలూకాఫీసు గుమాస్తాగా చేరిన సంవత్సరం లోపుగానే నన్ను మా తాలూకా సప్లయి ఆఫీసరుగా చేశారు. ఈ ప్రమోషన్ వల్ల నాకన్నా నాభార్యకు అమితమైన సంతోషం కలిగింది. కాపురానికి వచ్చినప్పటినుండి నా వృత్తిలో అభివృద్ధికొరకు ఆవిడ శ్రద్ధగా చేస్తూ వచ్చిన పూజలు పునస్కారాలు యీ విధంగా ఫలించడంతో ఆమె ఆనందం, విజయోత్సాహం మిన్నుముట్టాయి.

నాకు యీ ప్రమోషన్ రావడం మా ఆవిడ ఆనందానికి గొప్ప కారణమైనప్పటికీ, ఆమె కింకా తృప్తికలగలేదు. నేను యింకా రెండు మూడు మెట్లు ఎక్కాలనే ఆమె సంకల్పం. అందుచేత ద్విగుణీకృతమైన భక్తి శ్రద్ధలతో నాభార్య మళ్ళీ వ్రతాలు, ఒక్కప్రొద్దులు వగైరాలు ప్రారంభించింది.

నా నూతనోద్యోగ ధర్మం మునుపటిలాగా నన్ను యింటిపట్టున వుండనిచ్చేది కాదు. నెలకు దాదాపు యిరవైరోజులన్నా నేను ధాన్య సేకరణకొరకు గ్రామసంచారం చెయ్యాలి. సహజంగా నేను చాలా బద్ధకస్తుణ్ణి. ఊరూరా తిరగడం నాకు అట్టే యిష్టంలేదు. కాని యీ ఉద్యోగం నా బద్ధకాన్ని హరించివేసింది.

ప్రస్తుతం నా ఉద్యోగం పుణ్యకార్యాలలో పుణ్యకార్యాలు నాచేత చేయిస్తూందని నా నమ్మకం. ఎందుకని మీరు సందేహించవచ్చు. దానికి నా సమాధానమిది. చూడండి. పట్నవాసాలలో నెలజీతాలకు, కక్కుర్తిపడి చిన్న పెద్ద ఉద్యోగాలుచేస్తూ, ఈ దుర్భర కలికాలంలో, గ్రామాలపైనే తమ ఆహారంకొరకు ఆధారపడి వుంటారు వేనకువేల జనం. నాబోటి వాళ్లు ఊరూరా తిరిగి, అపాయాలన్నిటికి గురి అవుతూ భూగర్భంలో దాగిన ధాన్యాన్ని పైకి పెకలించి, ఆ అన్నార్తుల నోటికి అన్నం అందిస్తారు. ఇది కేవలం మా ఉద్యోగ ధర్మమైనప్పటికీ, యిది కొంతవరకు పుణ్యకార్యమని ఊహించేవాళ్ళలో నేనొకణ్ణి.

సాధారణంగా నాలాంటి ఉద్యోగస్థులంటే కొంతమందికి చులకన, చాలామందికి ద్వేషం. మరి కొందరికి భయం, కోపం! పెద్దపెద్ద రైతులకు మేమంటే చాలా చులకన! సామాన్య ప్రజలకు మామీద ద్వేషం. కొందరికి మామీద కోపం, భయం! ఇంతకూ కారణమేమంటే ప్రసిద్ధ లంచగొండులమని అందరి అభిప్రాయం.

లంచగొండులు ఎక్కడ లేరు? మమ్మల్నే ఇలా వ్రేలెత్తి చూపించటం దేనికి? ఒకవేళ ఒకడు అలా ఎక్కడైనా వుంటే వాళ్ళను పూతగా పెట్టుకొని అందరిని ఇలా అపవాదు పాలు చెయ్యవలసిందేనా?

ఈ ప్రశ్నల కెవ్వడూ సరైన సమాధానాలివ్వడు, అసలు ఆలోచించడు!

ఏది ఎలా వున్నప్పటికీ లంచగొండు లంటే నాకు తగని కోపం, అమిత ద్వేషం. నేను ఈ ఉద్యోగంలో ప్రవేశించి నప్పటినుండి ఇతః పూర్వం నా మొహం చూడని వారందరూ దొంగ నమస్కారాలు, లెక్కలేకుండా పెడుతున్నారు. వీళ్ళని చూస్తే నాకు ఆశ్చర్యంగా వుండటమే గాకుండా అరికాలి మంట నెత్తి

సిద్ధాంతి మల్లికార్జునం

కేకేది. వారికి తిరిగి నమస్కారం చెయ్యడానికి నాకు పనేముంది? నా పని నేను జాగ్రత్తగా చేసికొంటే నన్ను అడిగేవాళ్లుంటారా? ఈ నక్క వినయాలతో నాకేం పని? అని నేను చాలా నిక్కచ్చిగా వుంటూండే వాణ్ణి ప్రతి విషయంలో.

నేను ఆఫీసులో అడుగు పెట్టినప్పటినుండి గుమాస్తాలకు చాలా ఇరకటంగానేవుంది. వార్తాపత్రికలలో చదివే ఘోర కృత్యాలన్నీ నన్ను పట్టి పీక్కుని తినడంవల్ల నేను నా శక్తికొద్దీ దేశంలో క్షామపరిస్థితుల నరికట్టవలెననే సదుద్దేశంతో ఆఫీసు విషయాలలో చాలా కఠినంగా వుండేవాణ్ణి. ఆఫీసులో కాగితాలు ఎప్పటికప్పుడు తమపని పూర్తిచేసికొని చప్పున వెళ్ళి పోతూండేవి. గుమాస్తాలు వేళకు వచ్చి పని చేసుకు పోతూండేవారు. నేను గుమాస్తానుండే యీ పదవికి రావడంచేత నా క్రిందివాళ్ళని చాలా కనికరంతో చూస్తూండేవాణ్ణి. ఇప్పుడు నా ఆఫీసు మునుపటికన్నా చక్కగా వుందని, నేను చాలా నిజాయితీ గల ఆఫీసరునని, ఊళ్ళో అందరు నన్ను పొగుడుతూ వచ్చారు. పెద్దపెద్ద రైతులు నా కొంపచుట్టూ అహర్నిశాలు తిరగడం మానుకున్నారు.

కాని, మనదేశంలో నిష్కర్షగా మాట్లాడినవాడు, నలుగురి కళ్ళల్లో రాక్షసుడే. నిజాయితీ గల ఆఫీసరు కావాలని ఏ ప్రజలు కోరుకుంటారో ఆ ప్రజలే, ఆ నిజాయితీ ఆఫీసర్ని నానాబూతుబండ తిడతారు. అలాంటి ఆఫీసరుంటే గుమాస్తాలకు కడుపులోమంట. వేళకు ఆఫీసుకువచ్చి పనిచేసికొని, వేళకు ఇంటికి పొండయ్యా మహాత్ములారా అంటే వాళ్ళకు మంట. ఆఫీసుకు వచ్చే కాగితాలను ఎప్పటికప్పుడు సరిచూచి తక్షణం పంపమంటే, వాళ్లకు తలప్రాణం తోకకువస్తుంది. ఇంతటితో ఆగదు. ఆ ఆఫీసరుమీద లేనిపోని విషప్రచారంచేస్తారు. గుమాస్తాలు, ఆ శా భ ం గ ం కలిగిన పెద్ద మనుష్యులు. కొంచెం పలుకుబడి వున్నవారైతే ఎమ్. ఎల్. ఏ. ల ద్వారా మంత్రుల వరకు యీ విషయాన్ని తీసికొనివెళ్లి వాళ్ళ తాడు పుటిక్కున తెంచుతారు. అందుచేతనే యీనాడు నిష్కర్షగా నిజాయితీగా తన పని తాను చూచుకొని పొయ్యే ఆఫీసర్లకు పుట్టగతుల్లేవు.

కాగా ప్రస్తుతం నేను ఇప్పుడు నాతో అవసరం కలవాళ్లందరికీ పక్కలో బల్లెమై కూర్చున్నాను. ఎందరెందరో నన్ను వేలకొద్దీ లంచాలతో లొంగదీసుకో చూచారు. నయాన భయాన కూడా నాకు బోధించారు, "సక్రమంగా ప్రవర్తించమని". కాని ఎంత ప్రయత్నించినా, నేను సమాధాన పడలేక పొయ్యాను. ఆఖరుకు మొండి బండనై కూర్చున్నాను. ఇంత మొండితనానికి కారణం, నా ఉద్యోగ ధర్మం నిష్కళంకంగా నెరవేర్చి అన్నార్తులకు సక్రమంగా ఆహారం సమయానికి అంద చెయ్యాలని నాలో క్షణక్షణమూ ప్రజ్వరిల్లే కోరికే!

నానాటికి నా శత్రుకోటి ఎక్కువౌతూంది. నన్ను చూచి భయపడుతూన్నట్లు నటించినా, గుమస్తాలందరు నన్ను ఆడిపోసుకోని నిముషం లేదు. నా శత్రుకోటి నన్ను దూషిస్తూంది. అయినా వీటన్నిటినీ నేను లెఖ్ఖ చెయ్యలేదు.

ప్రోగ్రాం ప్రకారం ఒకనాడు యిద్దరు ముగ్గురు పోలీసులతో, జీప్ కారుమీద ఒక పెద్ద పల్లెటూరికి వెళ్ళాను. ఆ వూళ్ళో గొప్పగొప్ప రైతులు చాలామంది వున్నారు. పేరుమోసిన దేశ భక్తులు కూడా వున్నారు. మంత్రులతో బాదరాయణ సంబంధంగల పెద్దలు కూడా ఆ వూళ్లో వున్నారు. ఆ పల్లె ఆ జిల్లాలో సస్యశ్యామలమైనది. ఈ వూళ్లో పుట్లకొద్దీ ధాన్యం సేకరించాలనే నిశ్చయంతోనే వెళ్ళాను.

నేను వెళ్ళడం వెళ్ళడం తిన్నగా పెద్ద రైతుల యిళ్ళకే వెళ్ళాను. వాళ్లుచేసిన మర్యాదలు చాలా గొప్పగానేవున్నాయి. ఇదివరలో నేను గుమస్తాగావున్న రోజుల్లో వీరే నన్ను లెఖ్ఖలేకుండా మాట్లాడి, వాళ్లక్కావలసిన పనులన్నీ తాసిల్‌దార్ గారి ద్వారా ఏదోవిధంగా జరుపుకున్నారు. వాళ్లే యిప్పుడు నా అధికారాన్ని పురస్కరించుకొని నన్నిలా మర్యాదలు చేస్తున్నారు. ఇందులో మోసం నాకు తెలుసు. కాని యిప్పటి పల్లెటూళ్ళనిండా మోసమే! పెద్దరైతులే గొప్ప మోసగాళ్లు యీ రోజుల్లో.

నే పోయినపని ఏమీ ఆటంకాలు లేకుండా జరిగింది. వాళ్లు యివ్వదల్చుకున్న ధాన్యం నస పెట్టకుండా నే యిచ్చారు. ఇంకా కొంత కావాలని నేను బలవంతం చేస్తే మరొకసారి తప్పక యిస్తామన్నారు చాలా వినయపూర్వకంగా. వాళ్ళమాటలు నమ్మి నేను వచ్చేశాను. తర్వాత ఆ వూళ్లో రైతుల యిళ్ళకుపోయి చాలాధాన్యం బైటికి తీసి సీలుచేసి, లెఖ్ఖగట్టి కొరవ సరవలన్నీ తీర్చుకున్నాను.

నేను యిలా ధాన్య సేకరణ చాలా జాగ్రత్తగా చేస్తూండగా నే వూళ్లో చాలా అలజడి బైలుదేరింది. నన్ను తిట్లేవాళ్లు కొందరు బైలుదేరారు. నేనెప్పుడు యీ తాలూకానుంచి వదలి పోతానో అని కొందరు మొత్తుకున్నారు. ఫలానా వాళ్ళయింట్లో, నేను లంచం పుచ్చుకున్నానంటూ ఒక ప్రచారం లేవతీశారు. నా జేబులో వందరూపాయలనోట్లు బోలెడున్నాయని కొందరన్నారు. ఒక్కసారి పక్కలు విరగతంతే, మళ్ళీ యీ వూరి పొలిమేరలో అడుగు పెట్టనని కొందరు తీర్మానించారు. ఊరి పొలిమేర దాటేలోగా నన్ను పాతిపెట్టేస్తామని కొందరు ప్రతిజ్ఞ పట్టారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లు నేను చాలానే విన్నాను.

సాయంకాలం వరకు నేను నా పనిలో మునిగి పొయ్యాను. ఈ బెదిరింపులతో నేను చాలామటుకు జంకాను. పల్లెటూరివాళ్లు ఏ విషయంలోనైనా అందరు ఏకమై పనిచేస్తారని నాకు తెలుసు. ఆనాటితో నా జీవితం ఆఖరని తీర్మానించుకున్నా ... కాని, పోలీసులుండటం వల్ల పరవాలేదని పించింది. ఇంతకూ నేను అక్రమంగా, హృదయం లేకుండా ఏపనీ చెయ్యలేదు. చిన్న రైతుల నెక్కువగా పీడించలేదు. పెద్దరైతులను బలిమాలి భంగపడి, అవసరమైతే అధికారం వుపయోగించి ధాన్యసేకరణ చేశాను. చిన్న రైతులు నన్ను దేవునిలా భావించారు. పెద్ద రైతులు ఆగర్భశత్రువులా చూచారు నన్ను. వాళ్లుపెట్టే శాపనార్థాలు పడుతూ నా పని ముగించుకొని రికార్డుతో కూడా జీప్ కారులో కూర్చున్నాను.

పోలీసులు కూడా జీప్‌లో యెక్కారు. డ్రైవరు యింజను స్టార్ట్ చేశాడు. మా జీప్ కారుచుట్టూ జనం గుంపులుగా మూగారు. కొందరు దైన్యదృక్కులతో నాకు నమస్కారాలు పెడుతూంటే మరి కొందరు సుడ్లెర్రచేసికొని, కోరచూపులతో చూస్తూన్నారు. ఒకరిద్దరు ఆజానుబాహులు, గుంపువెనక నిల్చొని నన్ను చూస్తూ మీసాలు దువ్వుతున్నారు. వాళ్ళను చూడగానే నాగుండె ఝల్లున్నది!

ఇంజన్ పెద్ద గోలచేస్తూంది. డ్రైవర్ హారన్ యిచ్చాడు. చుట్టు మూగినజనం కారు కదలిపోవడానికి దారితీసి ప్రయాణోన్ముఖులమైన మమ్మల్ని చూస్తూన్నారు. కారు కదిలింది. ఒక్క గజందూరం సాగిందో లేదో యింతలో ఎక్కడనుండో ఒక కాగితం ముక్క లోపల పడింది. తటాలున ఆ కాగితాన్ని చేతిలోకి తీసికొని చదివి,

"డ్రైవర్, కారు ఆపుచెయ్" అన్నాను. తక్షణం కారు ఆగింది. నేను కారు దిగాను. ఇప్పుడే వస్తానని చెప్పి, పోలీసులతో ఒక చిన్న సందులోపడి వెళ్లి ఒక పెద్ద పెంకుటింటిదగ్గరికి వచ్చాను.

ఆ యింటివాకిట రెండు పెద్ద అరుగులున్నాయి. ఒకపక్క కొట్టంలో పశువులు పడుకొని నెమరువేస్తున్నాయి. మా వేషాలు చూచి కొందరు సేద్యగాళ్లు లోపలికి వెళ్ళి ఏదో చెప్పారు. మరుక్షణమే ఒక ముసలావిడ బైటికివచ్చి:

"ఎవరు నాయనా? దేనికొచ్చారు" అన్నది.

"నేను ధాన్యంకొరకువచ్చిన ఇన్‌స్పెక్టరును" అన్నాను. నా మాటలు విని ఆ ముసలావిడ తెల్లపోయింది. "మాయింటో ఏమున్నాయి నాయనా, ఎవరోవచ్చి మొన్న పాతరతీయించి అన్నిగింజలూ జవురుకుపొయ్యారు. ఇప్పుడు మా తిండిక్కూడా గింజల్లేవు" అన్నది.

"ముసలమ్మా నాకేమీ అక్కర్లేదు. కాసినే చాలు. త్వరగా కాలిస్తే వెళ్ళిపోతా. పొద్దుకూకుతోంది" అంటూ నేను లోపల అడుగు పెట్టాను. ఇంట్లో గోడలకు దేశనాయకుల చిత్రపటాలు వరుసగా తగిలించివున్నాయి. గాంధీ పటానికి చక్కటి పూలమాలవేసి వుంచారు పాపం! ఒకమూల పెద్ద అరుగుంది. దానిమీద చాప పరిచివుంది. ఆ చాపమీద ఒక నడి

వయసులో వుండే స్త్రీ కూర్చుని రాట్నం వడుకుతూంది.

"ఏవమ్మా ఆ రాట్నం, చాప, తీసేసెయి" అని అధికారపూర్వకంగా దబాయించాను.

"ఎందుకు నాయనా! ఇల్లంతా చూచుకో, నీకేమీ అడ్డంలేదు. అవిగో వడ్ల గాదెలు" అంటూ చూపించింది. "నా కదంతా అక్కర్లేదు. ముందు నీవు లేచి అవన్నీ తీసిపారెయ్" అన్నాను.

ఆమె లేచి ఇవతలికి వచ్చింది. పోలీసు జవాన్లు వెళ్ళి రాట్నం చాప లాగి పారేశారు. చాప కింద తలుపు చెక్క వుంది. ఆ తలుపు తెరిచి లోపల చూస్తే! లోపల పుట్లకొలదీ పాతబడ వడ్లు!

నా జీవితంలో ఎన్నడూ ఇలాంటి రహస్యం కని విని ఎరుగలేదు. ఈ మోసమంతా గాంధీ పేరిట, రాట్నం వడకటమనే తెల్లతెర క్రింద జరుగుతూంది. అన్నిటికన్న ఆ స్త్రీల సాహసానికి, కపటానికి నాకు అమితమైన ఆశ్చర్యం కలిగింది. లోపలి వడ్లుచూసి వెంటనే వాటికి సీలువేసి, ఆర్డరు వచ్చేవరకు దాన్ని తాకడానికి వీల్లేకుండా నిబంధనలుచేసి తిరిగి వచ్చేశాను. నా యీ చర్య గమనిస్తూ గుడ్లలో నీరు నింపుకొని నిల్చున్నారా ఆ స్త్రీ మూర్తులు.

అప్పటికి బాగా చీకటిపడ్డది. ఆ వూరినుంచి నేను వెళ్ళవలసిన వూరు పదిమైళ్ళలో వుంది. ఆ దారంతా ఆవేళప్పుడు నిర్మానుష్యం. రోడ్డు కిరువైపుల పెద్దపెద్ద తోపులు, తాటిచెట్లు' చవిటిభూములు, పొలాలు వున్నాయి. ఈ పది మైళ్ళలో యీవేళప్పుడు ఏంజరిగినా జరగ వచ్చు. పిలిస్తే దిక్కు కూడా వుండదు. అందు చేత పోలీసుజవాన్లను తుపాకులతో సిద్ధంగా వుండమన్నాను. డ్రైవరుతో వీలైనంత స్పీడు పెట్టమని చెప్పాను.

కారు కదిలింది. చాలా వేగంగా పోనిస్తున్నాడు డ్రైవరు. అప్పుడప్పుడే ఆవూరి పొలిమేరదాటి రెండో మైలురాయి దాటి వెళ్తున్నాము. అక్కడ రోడ్డుమీదికి చెట్లువాలి గుబురుగావుంది. ఇక్కడే ఏదైనా జరిగితే జరగవచ్చునని అందరికి హెచ్చరిక చేశాను.

ఉన్నట్లుండి పదిమంది అటు, పదిమంది ఇటు నిల్చున్నారు కర్రలు చేతపుచ్చుకొని. కారు వేగంగా వెళ్తున్నా వారుకదల్లేదు. కారు కడ్డంగా పడటానికి వారు సిద్ధంగా వున్నారు. మా డ్రైవరు బ్రేకు వేద్దామా వద్దా అనే సందేహంతో వున్నాడు. కాని ఇంతలోకే పోలీసులు తుపాకులు బారుపెట్టి, నాలుగైదుమాట్లు గాలిలో పేల్చారు!

ఆదెబ్బతో ఎక్కడివాళ్ళక్కడ పరారీ చిత్తగించారు. తర్వాత నిరపాయకరంగా బ్రతుకు జీవుడా అంటూ ఇల్లు చేరుకున్నాము రాత్రి $8\frac{1}{2}$ గంటలకు.

* * *

నేను యీ ఉద్యోగం నిర్వహిస్తూ ఇప్పటికి మూడు నెలలు పూర్తికావస్తూంది. నేను క్యాంపునుంచి వచ్చిన వారంరోజులకు పేపర్లో నేనొక విషాదవార్త చదివాను. నేను ధాన్య సేకరణ కొరకు వెళ్ళిన వూళ్ళో ఒకడు ఒక చీటీ నా కారులో పడవేశాడు. వాణ్ణి నాలుగైదు రోజుల తర్వాత ఖూనీ చేశారట. పాపం ఆ అమాయక వ్యక్తిని తలచుకుంటే నాకు చాలా జాలివేసింది. వాడి దుర్మరణానికి నేనే కారణంగదా అని ఆ రోజంతా చాలా విచారించాను.

* * *

మరునాటి పొద్దున మా ఆవిడ బ్రహ్మాండమైన వ్రతం ప్రారంభించింది. ఆ వ్రతానికి చాలా తంతు జరగవలసివచ్చి, నా దగ్గర పది హేను తీసుకొంది. ఇదంతా దేనికిఅని అడిగాను. ఇప్పటికి నా ఉద్యోగం ఆవిడకి తృప్తికరంగా లేదనీ, యింకా గొప్పఉద్యోగం రావాలనీ, యీ వ్రతం చేస్తూన్నట్లు చెప్పింది. నేనింక పలకడానికి ఆస్కారం ఏముంది?

వ్రతం పూర్తి అయింది జయప్రదంగా. నాలుగోనాడు పోస్టుజవాను ఒక పెద్దకవరు నా కందించాడు. దాన్ని చింపి లోపల చూచాను ఆదుర్దాగా.

నన్ను వెంటనే వెళ్ళి తాలూకాఫీసులో గుమాస్తాగా ఛార్జీ తీసికొనమన్న తాఖీదును చూస్తూ నేనూ నా భార్యా నిర్ఘాంత పోయి అలాగే నిల్చున్నాం!